REGD. NO. A. 18 విడి ప్రతి 0-20 న. పై శుక్రవారం 13-10-61

# జమీన్‌రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకటామానాయుడు

సంపుటి 33 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 41




"శ్రీ సుబ్బారెడ్డి నెల్లూరును వదలడం కాంగ్రెస్ బలాన్ని కాంగ్రెస్ నాయకుడు శంకించడమే"

# ఏ.సి. రాపూరు సీటుకు ముఖ్యమంత్రి ఆక్షేపణ!

## వారిని నెల్లూరుకుపంపి, రాపూరు కొండయ్యకివ్వాలనిసూచన

★

## రాష్ట్రంపైన 50 సీట్లకుపేచీ

[మా హైదరాబాదు విలేఖరి]

ఎన్నికలసంఘం తొలిరోజు సమావేశంలో ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య, శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారలమధ్య నెల్లూరు, తదితరసీట్ల అభ్యర్థులకు సంబంధించి తీవ్రమైన వాగ్యుద్ధం జరిగింది. రెండు దశాబ్దాలపాటు పాలించిన నెల్లూరును వదలి, ఏ. సి., రాపూరుపోవడం, కాంగ్రెస్ బలాన్ని కాంగ్రెస్ నాయకుడే శంకించడమవుతుందని, కావున వారిని నెల్లూరుకు నియమించి, శ్రీ జి. సి. కొండయ్యకు రాపూరు ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి సూచించారట. ఈ విధంగా ఏ. సి., సంజీవయ్య ఇరువురు సుమారు 50 స్థానాలకు సంబంధించి అభ్యంతరం తెలిపినట్లు తెలుస్తున్నది.

ఢిల్లీలో సంజీవయ్యకు శ్రీ జగజీవన్‌రాం అండ పూర్తిగా వుండేట్లున్నది. ఆ అండతోనే వారు అభ్యంతరాలకు దిగారేమోనని అంటున్నారు.

ప్రదేశ్ ఎన్నికలసంఘం మంగళవారం అధ్యక్షులు శ్రీ కళ్యాంరాజాఇంట్లో సమావేశమైంది. ఈ సమావేశంలోసాధారణ చర్చ మాత్రమే జరిగింది.

తొలినాటి తొలిసమావేశంలోజరిగిన యీ సాధారణ చర్చలలో ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య మాజీ మంత్రి ఏ. సి. సుబ్బారెడ్డిగారు తొడలు చరుచుకున్నంతపని అయిందనివినికిడి.

త్రిమూర్తుల సంఘంవారు తయారుచేసిన జాబితాలోని చాలా శిఫారసులు ముఖ్యమంత్రికి నచ్చలేదనేది జగద్విదితం. నిన్నటి దినం (సోమవారం) స్వగృహంలో రైల్వే మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రాం సమక్షంలో జరిగిన సమక్షంలో జరిగిన నిమ్నజాతి పెద్దల సమావేశంలో శ్రీ సంజీవయ్య వెలిబుచ్చిన భావాలుచూస్తే, ఎన్నికల సంఘంలో తాను 'ఏకాకి' అనే అభిప్రాయాన్ని వ్యక్తపరచి, హరిజన గిరిజన అనుచరులకు ఆదుకోలేని నిస్సహాయతను ప్రకటించారా అనిపిస్తుంది.

కానీ హరిజనులకు, గిరిజనులకు, ఇతర వెనుకబడిన వర్గాలకు జగ్‌జీవన్‌రాంగారు కాస్తధైర్యం పోసివెళ్ళారనే తోస్తుంది. అఖిల భారత కాంగ్రెస్ కోలమానము ప్రకారం సక్రమంగాలేని శిఫారసులన్నింటినీ కేంద్ర ఎన్నికలసంఘం తిరగదోడుతుందని వారు స్పష్టీకరించడంతో యీ వెనుకబడిన వర్గాలన్నీ ఒక్కొక్కటిగా ముందుకురా నారంభించాయి.

జగ్‌జీవన్‌రాం అండ చూచుకొనియే, ఎన్నికలసంఘంలో, ఏకాకి అయినాసరే అనే ధోరణిలో ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య ప్రవర్తించినట్లు తోస్తున్నది.

ఎన్నికలసంఘం తొలిసమావేశంలో త్రిమూర్తుల శిఫారసులను కాదనటంలో శ్రీ సంజీవయ్య మొండంగ జేశారట.



తూర్పు గోదావరిజిల్లాలో 6 సీట్లు, పశ్చిమ గోదావరిలో 2, కృష్ణలో 2, గుంటూరులో 8, నెల్లూరులో 2 సీట్లవిషయంలో త్రిమూర్తుల శిఫారసులకు ముఖ్యమంత్రి ఆక్షేపణ తెలుపుకున్నారట.

నెల్లూరుజిల్లాకు సంబంధించినంతవరకు, ఏ. సి. సుబ్బారెడ్డి రాపూరుకు వలస వెళ్ళటం సుతరామూ తగదని శ్రీ సంజీవయ్య పట్టుపట్టారట. దాదాపు రెండు దశాబ్దాలు నిరాఘాటంగా, నెల్లూరు పురపాలక సంఘాన్ని ఏకచ్ఛత్రాధిపతిగా ఏలిన ఏ. సి. నెల్లూరును వదలివెళ్ళటం తగదనీ, అది కాంగ్రెస్ బలాన్ని కాంగ్రెస్ నాయకుడైనవాడే శంకించటంగా అవుతుందని త్రిమూర్తుల శిఫారసును శ్రీ సంజీవయ్య విమర్శించారని తెలుస్తోంది. అదీగాక నెల్లూరు ఏ. సి. గారి స్వస్థానం. గతంలో ఎన్నికైనసీటు. దీన్నివదలి రాపూరు వెళ్లుట తనకిరాదనీ అలా రాపూరుసీటు వారికివ్వటం ఏ. ఐ. సి. సి. నియమావళికి విరుద్ధమనీ శ్రీ సంజీవయ్యగారు చాలా సేపు కమిటీలో వాదించారట.

—తరువ 7-వ పేజీలో.

# వంగల్లుకు ఏ. సి. అభ్యంతరం

## సూళ్లూరుపేటకు శ్రీనివాసులురెడ్డిని, ఉదయగిరికి మౌలా సాహెబును నిర్ణయించవలసిందిగా సంజీవయ్యసూచన

శ్రీ వంగల్లు కోదండరామరెడ్డి అభ్యర్థిత్వానికి ఎన్నికసంఘంలో శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి అభ్యంతరం సమాదుచేసినట్లు తెలుస్తున్నది. అట్లనే ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య సూళ్లూరుపేటకు శ్రీ శ్రీనివాసులురెడ్డిని, ఉదయగిరికి శ్రీ మౌలాసాహెబును నిర్ణయించవలసిందిగా సూచించినట్లు గూడా తెలుస్తున్నది. నెల్లూరులో శ్రీ పెనుబోలు సుబ్బయ్య ప్రసక్తి గూడా వచ్చిందని, సుబ్బయ్య రౌండులో త్యాగంజేసినవాడని ఏ. సి. అన్నారని, అత్యాగఫలితం తెచ్చుకొని శ్రీ సంజీవయ్య ప్రశ్నించారని అంటున్నారు.

ఈ ఆక్షేపణలు యిట్లనేవుంటవో, లేక సామరస్యంగా పరిష్కారమవుతవో 14 తేది సాయంకాలం తేలవచ్చునంటున్నారు. ఏ.సి. మాత్రం తన అభ్యంతరాలకట్ల చాల పట్టుదలగా వున్నారని, అందువల్ల రాజీపరిష్కారం సాధ్యంగాదేమోననే అభిప్రాయం గూడా వున్నదని తెలుస్తున్నది. ఎన్నికసంఘ సభ్యులలోను, కాంగ్రెస్‌వర్గాలలోను నిస్పృహా వాతావరణం యేర్పడివుందని, 1952 పరిస్థితులు తప్పకపోతేమోననే సూచనలు కన్పిస్తున్నవని ఈరోజు (13 తేది) హైదరాబాదు నుండి వచ్చిన వార్తనుబట్టి తెలుస్తున్నది.

గ్రాము : భారత్. టెలిఫోన్ : 44.

కమ్మని కాఫీకి - సువాసన వక్కపొడికి

రెడ్డీస్ కాఫీపొడి

భారత్ వక్కపొడి

పేరు, ప్రఖ్యాతి పొందినవి.

—: విక్రేతలు :—

పి. కోటారెడ్డి, బి. తిరుపతిరెడ్డి కంపెనీ,

ట్రంకురోడ్డు — కావలి.

# ఎలక్షన్ సన్నాహాలు

*** పరిశీలకుడు ***

## ★ అసెంబ్లీ-లోక్‌సభ బ్యాలెట్ పేపర్లు-క్రొత్తఏర్పాటు
## ★ ప్రజాసోషలిస్టుపార్టీ ఎలక్షన్ వాగ్దానాలు
## ★ స్వతంత్రులవుతున్న సౌరాష్ట్ర సంస్థానాధీశులు
## ★ నెహ్రూహెచ్చరికతో ఉత్తరప్రదేశ్‌లో మార్పు

వచ్చే జనరల్ ఎన్నికల సందర్భంలో దేశంలోని ఎన్నికల ఏర్పాట్లను గురించి ఎన్నికల కమిషనర్ శ్రీ కె. వి. కె. సుందరం పత్రికావిలేకరులకు తెలియజేశారు. ఎన్నికల సందర్భంలో దేశం మొత్తంమీద 2 లక్షల 25 వేల పోలింగ్ కేంద్రాలను నిర్వహించడానికి వివిధ రాష్ట్రాలకు చెందిన 10 లక్షల మంది అధికారులు కావలసి వుంటుందని చెప్పారు. వీరేగాక ఎన్నికలలో పనిచేయవలసినవారు వేలాది సంఖ్యలో వుంటారని అన్నారు. ఎన్నికల నిర్వహణక్రింద ప్రభుత్వానికి రు. 6 కోట్లు ఖర్చు అవుతుందట.

ఎన్నికలనుగురించి బోధించే చలనచిత్రాలు బొంబాయిలో ప్రస్తుతం తయారవుతున్నాయనీ; ఓటర్లకు ఎన్నికలను గురించి ప్రబోధించుటకు దేశంలో నమూనా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారని శ్రీ సుందరం తెలియజేశారు.

గులాబిరంగు వుండేది శాసనసభ బ్యాలట్ పేపరుగాను; తెల్లనిరంగువుండేది పార్లమెంటు బాలట్ పేపరు అని ఎలక్షన్ కమిషనర్ స్పష్టంగా తెలియజేసివున్నప్పటికీ; రెండు బ్యాలట్ పేపర్లను కలిపియివ్వడంవల్ల ఏది దేనికో స్పష్టంగా తెలియక ఓటర్లు కంగారుపడే ప్రమాదంవుందని రాజకీయ పక్షాలు అభ్యంతరం తెలియజేసినమీదట పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు శాసనసభ, పార్లమెంటు బ్యాలట్ పేపర్లను విడివిడిగా ఒకదానితర్వాత ఒకటి యివ్వబడతాయని ఎలక్షన్ కమిషనర్ అన్నారు.

ఎలక్షన్ ప్రచారానికి ఆలిండియా రేడియోను రాజకీయపార్టీలు ఉపయోగించుకోవచ్చునని చెప్పారు.

### లీగ్‌తో పోటీ

రానున్న ఎన్నికలలో కేరళలో ముస్లిం లీగ్‌తో కాంగ్రెస్ పోటీచేస్తుందనీ, ప్రజా సోషలిస్టు పార్టీతో మాత్రమే కాంగ్రెస్ పొత్తుపెట్టుకుంటుందనీ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి యీ వారం పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ వెల్లడించారు.

### పి. యస్. పి. ప్రణాళిక

ఈ వారం నాగపూర్‌లో సమావేశమైన ప్రజా సోషలిస్టుపార్టీ జాతీయ కార్యవర్గం, కొన్ని సవరణలతో పార్టీ ఎన్నికల ప్రణాళికను ఆమోదించింది. ఈ సవరణలలో స్త్రీ స్వాతంత్ర్యము, వరకట్న నిషేధం చేర్చబడినవి. స్త్రీ పురుషుల సమాన ప్రతిపత్తి క్రియారూపం ధరించుటకు, అన్నిదశలలోను స్త్రీలకు ఉచిత విద్యాసౌకర్యాన్ని కల్పించుటకు; గ్రామ పంచాయతీలలోనూ, మున్సిపాలిటీలలోను కొన్ని స్థానాలు స్త్రీలకు కేటాయించుటకు; షెడ్యూల్డు జాతుల, తెగల అభివృద్ధికి; చక్కెర పరిశ్రమనుకూడా సహకార రంగంక్రిందికి తీసుకొనిరావడానికి; ఆహార పదార్థాలపైన, ముతకబట్టపైన, ఎక్సైజ్ పన్నును, అమ్మకంపన్నును రద్దుచేయడంద్వారా పేదప్రజల వస్తువినియోగ స్థాయిని కాపాడడానికి; దున్నేవారిదే భూమి అన్న సిద్ధాంతాన్ని గుర్తిస్తూ, అన్యాయంగా భూములనుంచి తొలగించబడిన కౌలుదార్లకు తిరిగి భూమి రక్షణకల్పించుటకు; కనీసవేతనాల చట్టాన్ని సమర్థవంతంగా అమలుజేసి భూమిలేని పేదరైతుల జీవనస్థాయిని పెంచడానికి; దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడి దేశంలో సాంఘిక, ఆర్థిక పరివర్తనను తీసుకొనిరావడానికి కృషిచేస్తుందని ప్రణాళికలో పేర్కొనబడింది.

### గుజరాత్

వచ్చే జనరల్ ఎన్నికలలో, స్వతంత్ర పార్టీ మద్దతుతో "స్వతంత్రులు"గా సౌరాష్ట్రలోని సంస్థానాధీశ్వరులు (ఈ ప్రాంతంలోనే దాదాపు 200 మంది సంస్థానాధీశ్వరులుండిరి.) పోటీచేయ నిశ్చయించుకోవడం, సౌరాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు ఆందోళన కలిగించింది. మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ యు. యన్. ధేబర్ ఎకాఎకి ఢిల్లీనుండివచ్చి, అయిదురోజులపాటు జామ్‌నగర్, రాజకోట, ధ్రోల్‌లలో ఒక అరడజను ప్రముఖ సంస్థా

—కొరవ 12-వ పేజీలో



2 తేది నెల్లూరుజిల్లా అల్లూరుకు విచ్చేసిన ప్రణాళికా మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డికి స్వాగతమిచ్చి తీసుకపోతున్న శ్రీ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి, సూకలపాటి సుందరరామిరెడ్డి వగైరా స్థానిక ప్రముఖులు.

# ఈ వారంలో మన దేశం

### బీహారు వరదలు

అదేమిదురదృష్టమోగాని యీసంవత్సరం వరదలు పొంగి సంభవించిన జలప్రళయం ఇటీవల కొలది సంవత్సరాలుగా జరిగివుండలేదు. కోసీనది వరదప్రమాదానికి ఈ సంవత్సరంలో రెండవసారి బీహార్ రాష్ట్రంగురయి, దాదాపు 500 గ్రామాలకుపైగా నీట మునిగిపోయి, ఈ వరద ప్రమాదంలో దాదాపు 1700 మంది మరణించినట్లు, లక్షలకొలది యిళ్లు కూలిపోయి లక్షలాది ప్రజలు నిరాశ్రయులైనట్లు రోజురోజు చేరుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నవి. ధన నష్టం, పంటల నష్టం వర్ణనాతీతం. బీహార్ జలప్రళయం, 1934 భూకంపాన్నికూడా మరపింపజేసినట్లు చెప్పబడుతున్నది. వరదల ప్రమాదాలు ఈ ఏడాది మద్రాసు, కేరళ, ఒరిస్సా మహారాష్ట్రములకు విశేషనష్టం కలిగించాయి. ఈ పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వ మొత్తం వరదనిరోధక కార్యక్రమాన్ని పునఃపరిశీలన జరుపవలసిన పరిస్థితి కలిగింది. తృతీయ ప్రణాళికలో వరదనిరోధక కార్యక్రమానికి సుమారు రు. 61కోట్ల రూపాయలు కేటాయించబడింది గాని ప్రస్తుతం సంభవిస్తున్న వరద ప్రమాదాలదృష్ట్యా యిది ఏమాత్రం చాలదు. వరద ప్రమాదాలను నిస్సహాయస్థితిని ప్రదర్శిస్తూ ప్రజలను వారి దురదృష్టానికి వదలివేయడం ప్రభుత్వ ధర్మంగాదు. ఎప్పటికప్పుడు తాత్కాలిక సహాయకృషితో సంతృప్తిచెందకుండా, వరద నిరోధానికి దీర్ఘకాలిక పథకాలను రూపొందించడం ప్రభుత్వ కర్తవ్యం. నదుల పొర్లుకట్టలను పటిష్టంచేయడమే వరద ప్రమాదాలను నిరోధించజాలదు. ప్రస్తుతం నదులపై నిర్మించే ఆనకట్టలను, నీటిపారుదల అవసరాలకుతోడు, యాదృచ్ఛికంగా సంభవించే వరద ప్రమాదాలనుకూడ తట్టుకొనే విధంగా నిర్మించడం అవసరం. వరద ప్రమాదానికి గురైన బీహారు ప్రజలను, ఆ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే గాకుండా, భారతీయులందరు ఆదుకోవడం ధర్మం.

—కొరవ 12-వ పేజీలో.

ఆగండి! ఇక్కడకే మనం పోవాలనుకున్నది.



రాయవరపు శంకరయ్యా అండ్ సన్సు,
CLOTH MERCHANTS
ట్రంకురోడ్డు (Tel : 138) నెల్లూరు

# పల్లెలు

- దర్శి, పొదిలి క్షామం
- నక్కలగండిక్రింద నష్టం
- గూడూరు భూదానం
- కందుకూరు హాస్టల్లో మూడురోజులు పస్తు

**దర్శి క్షామం**

రెండుమూడేళ్లుగా వర్షాలులేనందున సజ్జ, జొన్న, కొర్రపైర్లు మాడిపోయినవి. చెరువులక్రింద వరిపైరు ఎండిపోయింది. కొన్నిచోట్ల త్రాగునీటికిఎద్దడికూడా వచ్చేట్లున్నది. పశువులు లేవు. వలసలు ప్రారంభమైనాయి. కావున ప్రభుత్వం ఫిర్కాకు రెండు చొప్పున ధాన్యండిపోలు తెరవాలి. పశువులకొర్పించుటకు కాలువలకు రెండుపశువులగ్రాంటు మంజూరు చేయాలి. కిస్తులు, బుణాలు, ఫారెస్టుపుల్లరి వసూలు ఆపాలి. కిస్తురెమిషన్లు, విరివిగా ఇవ్వాలని కోరుచున్నాను.

—రావిపాటి మహానంద, దర్శిసమితి అధ్యక్షుడు.

**పొదిలి కబురు**

ఆముదము, జొన్న, కొర్ర, శెనగసాగు పైర్లు నీటికొరతవల్ల లేనాక, తెగుళ్ళమూలంగా కూడా నాశనమైపోయినవి. వరిపైరు సగానికిపైగా రెబ్బతిని ఎండిపోయింది. ఇప్పటికే

—కొరవ 10-వ పేజీలో.



★ ఢిల్లీలోని భంగీకాలనీలో జరిగిన ఒకానొక తన జన్మదినోత్సవ సందర్భంలో ప్రధాని ప్రముఖులతో సూత్రయజ్ఞం చేస్తున్న గాంధీజీ ★

## లాభించిన ఉపవాసం

పంజాబీసుబా వచ్చినా రాకపోయినా, 48 రోజులు సాగిన నిరాహార దీక్ష మాస్టర్ తారాసింగ్ ఆరోగ్యానికి మాత్రం మంచి లాభకారి అయింది. ఇంతవరకు సక్రమంగాలేని ఆహార విహారాలవల్ల చెడిన వారి ఆరోగ్యం దీనివల్లకుదుట బడుతుందని, వారి ఆయుః ప్రమాణం పదేళ్లు పెరిగే అవకాశమున్నదని వారి డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. అంటే పంజాబీసుబాకు ఇంకాగూడా వీరి ఉపవాసదీక్షలు, ఉద్యమాలు ఉన్నాయన్న మాట!

# బాపూజీ దివ్యస్మరణ

## —జిల్లాలో మహాత్ముని 92 వ జన్మదినోత్సవం

జిల్లాలోని పలుగ్రామాలలో జాతిపిత 92 వ జన్మదినోత్సవం శ్రద్ధాభక్తులతో జరుపబడింది. మాకందిన కొన్నివార్తలు దిగువ యిస్తున్నాము.

**నెల్లూరు**

తిక్కనార్యావారిపత్రంవద్ద, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీ మన్నే కల్లి హనుమంతరావుగారి అధ్యక్షతన జరిగింది. ఇంద్రగంటి, నవులూరు, ఖాజామొహిద్దీన్ గారలు ఉపన్యసించారు.

రంగనాయకులపేట మిడిల్ స్కూల్లో హెడ్మాష్టరు శ్రీ పి. పుల్లయ్యగారి అధ్యక్షతన గాంధీజీ జన్మదినోత్సవం జరిగింది. శ్రీ ఆర్. వెంకటరెడ్డి, ఇందిగంటి ప్రసంగించారు.

శ్రీ అప్పల ఆంజనేయులుగుప్తగారి నివాసము 'ప్రకాష్‌భవనం'లో వికలాంగులకు, కష్టరోగులకు చిరుతిండి, ఆహారపదార్థాలు, మందులపంపకంతో గాంధీజీ జన్మదినం ప్రారంభమైంది. శ్రీ ఉడ్‌లాండ్సువారి ప్రభృతులు వీటికి అధ్వర్యం వహించారు. శ్రీ ఆంజనేయులుగారు ఉపన్యసించారు.

**పంచేడు**

ప్రాథమికపాఠశాలలో జరిగింది. ఏకోపాధ్యాయుడు శ్రీ చీమలమర్రి రామకృష్ణయ్య పతాకావిష్కరణం గావించారు. గ్రామపారిశుద్ధ్య కార్యక్రమంలో అందరూ పాల్గొన్నారు. గ్రామసేవిక శ్రీమతి టి. సుభద్రమ్మ అధ్యక్షతన సభజరిగింది.

**అనుమసముద్రంపేట**

హెడ్మాష్టరు శ్రీ సయ్యద్ పాచ్చామియ్యా అధ్యక్షతన జరిగినసభలో ఒక సహాయోపాధ్యాయుడు శ్రీ షేక్ మస్తాన్ ఉపన్యసించగా, ఇంకొక ఉపాధ్యాయుడు శ్రీ కె. సుబ్రహ్మణ్యం, శ్రీ అప్పల ఆంజనేయులు గుప్తగారు పంపిన ఫలహారాలను పంచారు.

**ఇందుపూరు**

మహాత్ముని చిత్రపటఉత్సవం; పాఠశాల సభలో శ్రీయుతులు కొనగర్ల శేషాచలంశెట్టి, వి. పాకయ్య ఉపన్యాసాలు; శ్రీ వి. రాఘవయ్య తప్పెటెల్లాల పంపకం జరిగినవి.

**తుమ్మూరు**

వివేకానంద యువజనసంఘంవారి అధ్వర్యాన నూతనజతలఎద్దులు పూన్చిన రథంపై బాపూ రూపకటం వుంచబడి జయజయనాదాలతో వూరేగింపు జరిగింది. శ్రీ దువ్వూరు లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామముఖ్యులనేకులు ప్రత్యేకాహ్వానంపై పాల్గొన్నారు. ఉత్సవానంతరం ఆ హాలులు చిక్కటి లేసిటితో, కారికేళఫల తాంబూలాలతో వీడ్కోలింపబడినారు.

—కొరవ 8-వ పేజీలో.

# ఇతర జిల్లాలు

## రైలుమార్గాల విస్తరణలో ఆంధ్ర ప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయం

★

### గుడివాడ-భీమవరం బ్రాడ్‌గేజ్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి, శ్రీ అల్లూరి నిరసన

గుడివాడ - భీమవరంలను కలుపుతూ నిర్మించిన 41 మైళ్ల బ్రాడ్‌గేజి రైలుమార్గానికి యీ నెల 8 వ తేది కేంద్రరైల్వేశాఖామంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్‌గారు ప్రారంభోత్సవం జరిపారు. ఇంతకుముందు యీ రెండు పట్టణాలమధ్య మీటర్‌గేజ్ మార్గంవుండేది.

ఈ క్రొత్త బ్రాడ్‌గేజ్ రైలుమార్గం, కృష్ణా - పశ్చిమ గోదావరి జిల్లాలో పుష్కలంగా ధాన్యంపండే ప్రాంతంగుండా పోతుంది. ఈ ప్రాంతంనుండి బియ్యం బుకింగ్ 1 లక్షా 51 టన్నులవరకు జరుగుతున్నది. బ్రాడ్‌గేజిగా మార్చినందువల్ల రోజుకు 2,250 టన్నులవరకు రవాణా సౌకర్యం లభిస్తుందట.

విజయవాడ-మచిలీపట్నం (40 మైళ్ళు), తాడేపల్లి-గుంటూరు (16 మైళ్ళు), గుడివాడ-భీమవరం (41 మైళ్ళు)—యీ మూడు మీటర్‌గేజి రైల్వేమార్గాలను బ్రాడ్‌గేజిక్రింద మార్చుటకు రు. 7 కోట్ల ఖర్చుతో ఒక సమగ్రపథకం రూపొందించబడింది. గుడివాడ-భీమవరం బ్రాడ్‌గేజి రైలుమార్గం ఆ సమగ్రపథకంలో ఒకభాగం.

ఈ ప్రారంభోత్సవ సభకు ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య అధ్యక్షతవహించారు. పబ్లిక్‌వర్క్సుమంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు. రైలుమార్గాల అభివృద్ధిలో తమ యిరుగుపొరుగు రాష్ట్రాలు ఎంతో సహాయం పొందుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో రైలుమార్గాల అభివృద్ధికి కేంద్రం ఏమాత్రం సహాయంచేయనందుకు ముఖ్యమంత్రి విచారం ప్రకటించారు. ఆంధ్రరాష్ట్రం యితర రాష్ట్రాలకు విశేషంగా ఆహారధాన్యాలు ఎగుమతిచేస్తున్నప్పటికీ, యీ రాష్ట్రంలో రైలుమార్గాలు అభివృద్ధిచెందలేదని మంత్రి శ్రీ అల్లూరికూడ విమర్శించారు.

దేశ పురోగమనంతోపాటు, రైల్వేల

—కొరవ 10-వ పేజీలో.


## ట్రేడ్‌మార్కు హెచ్చరిక నోటీసు




(రిజిష్టరు నెం. 183044 ఐ)

ఇందువలన, ఇందుకు సంబంధించిన వారికందరకు ఎరుకపర్చునదేమనగా:- పై బ్రాండ్, ఇండియాప్రభుత్వ ట్రేడ్‌మార్క్సు రిజిష్ట్రేషన్‌క్రింద రిజిస్టరు కాబడినదనియు సదరు ట్రేడ్‌మార్క్ ఆంధ్రప్రదేశ్, మద్రాసు, మైసూరు, కేరళరాష్ట్రములలో మేము విక్రయించు బియ్యముబస్తాలకు సంబంధించినదై వున్నదనియూ, సదరు మార్క్‌లకు భంగము కలిగించినచో, చట్టప్రకారం చర్య తీసికొనబడునని యీ హెచ్చరించడమైనది.

దూడల రంగయ్య,

ప్రొప్రయిటర్: శ్రీ రామకృష్ణ రైస్‌ఫ్యాక్టరీ - కొడవలూరు (నెల్లూరుజిల్లా)

